

ధర్మాచరణతోనే అభ్యుదయం

అభ్యుదయం కోసం అందరూ ధర్మం వైపు అడుగులు వేయాలని రామానంద స్వామీజి తెలిపారు. 8లో



మెరుగైన సేవలు అందించాలి

రెవెన్యూ సిబ్బంది, అధికారులు ప్రజలకు మెరుగైన సేవలందించాలని కలెక్టరు సుమిత్‌కుమార్ అన్నారు. 8లో



మార్గశిర శోభ 8లో

విశాఖలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అర్ధరాత్రి నుంచే అమ్మవారి దర్శనానికి బారులుదీరారు.

న్యూస్‌రీల్

నేడు పాడేరు ఐటీడీఏలో స్పందన

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏ సమావేశమందిరంలో జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అన్నిశాఖల జిల్లా అధికారులు స్పందనకు హాజరుకావాలని ఆదేశించారు.

30,31 తేదీల్లో గిరిజన మ్యూజియంలో న్యూ ఇయర్ వేడుకలు

సాక్షి,పాడేరు: అరకులోయలో గిరిజన మ్యూజియాన్ని ఈనెల 30, 31 తేదీల్లో రాత్రివేళలో కూడా తెరచి ఉంచి, న్యూఇయర్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఐటీడీఏ పీవో వి. అభిషేక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అరకులోయలో పర్యటించే వారు ఈ రెండు రోజుల్లో రాత్రి సమయంలోనూ మ్యూజియంను సందర్శించవచ్చన్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ఇక్కడ థింసా నృత్యాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా విన్యాసాలు ఘనంగా జరుగుతాయని తెలిపారు.

చలిగాలుల విజృంభణ

- కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు



జి.మాడుగుల మండలం బందవీధిలో చలిమంటలు కాగుతున్న గ్రామస్తులు

సాక్షి,పాడేరు: జిల్లా వాసులను చలిగాలులు వణికిస్తున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 10గంటల వరకు మంచు తెరలు వీడడం లేదు. పాడేరు మండలం మినుములూరులో 11 డిగ్రీలు, అరకులోయలో 12 డిగ్రీలు, చింతపల్లిలో 13.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు గురువారం నమోదయ్యాయి. సాయంత్రం నుంచే చలిగాలులు విజృంభిస్తుండడంతో ప్రజలు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు.

రంగుమారిన ధాన్యాన్నీ కొనుగోలు చేయాలి

- సబ్ కలెక్టర్ ప్రశాంత్

రంపచోడవరం : రంగుమారిన ధాన్యాన్ని కూడా రైతుల నుంచి కొనుగోలు చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్ వ్యవసాయశాఖ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ఐ.పోలవరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దళారుల మాటలు నమ్మి తక్కువ ధరలకు పంట అమ్ముకుని నష్టపోవద్దని రైతులు సూచించారు. గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు రవాణా, హమాలీ చార్జీలను ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. గోనె సంచులను కూడా ముందస్తుగానే రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బంధం శ్రీదేవి, ఏవో లక్ష్మణ్, వీఏఏ మురళి పాల్గొన్నారు.

క్షయ రోగులకు పోషకాహారం పంపిణీ



పోషకాహార కిట్ అందచేస్తున్న ఐటీడీఏ పీవో చైతన్య

చింతూరు: డివిజన్‌లోని క్షయ రోగులకు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య గురువారం పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఏషింటీయా అడ్వాన్స్ సైన్స్ సంస్థ వీటిని సమకూర్చింది. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ క్షయ రోగుల ఆరోగ్యం మెరుగు పడేందుకు పోషకాహారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అక్టోబరు, నవంబరు నెలల్లో నమోదైన 37 మంది క్షయ రోగులకు రాగి, ప్రొటీన్ పౌడర్, కందిపప్పు, ఖర్జూరం, నూనె, గోధుమపిండితో కూడిన ఫుడ్ కిట్లను అందించినట్లు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది రామాంజనేయులు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

సామాజిక ఆకాంక్ష.. సాధికారమైన వేళ

- నేడు అరకులోయ నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్ర
- హుకుంపేటలో బహిరంగ సభ
- పాల్గొనున్న మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు



బహిరంగ సభ వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, నవరత్నాల అమలు కమిటీ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, ఇతర ప్రతినిధులు

సాక్షి,పాడేరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన సామాజిక సాధికారతను వివరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక సాధికారక బస్సు యాత్ర శుక్రవారం అరకులోయ నియోజకవర్గం హుకుంపేట మండలంలో జరగనుంది. నియోజకవర్గంలో అతి పెద్ద మండలమైన హుకుంపేటలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో ఈ యాత్రను నిర్వహిస్తున్నారు. వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసినప్పటి నుంచి నేటి వరకూ 55 నెలల పాలనలో జరిగిన సామాజిక న్యాయం, బడుగు,బలహీన వర్గాలకు అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించడమే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం. నియోజకవర్గ ముఖద్వారం హుకుంపేట మండలంలోని బర్మన్‌గుడ జంక్షన్‌లో ఉదయం 10గంటలకు బస్సు యాత్ర ప్రారంభమవుతుంది. వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎంలు పీడిక రాజన్నదొర, బూడి ముత్యాలనాయుడు, మంత్రులు సీదరి అప్పలరాజు, గుడివాడ అమర్‌నాథ్, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జీసీసీ చైర్ పర్సన్ శోభా స్వాతిరాణి, ఏపీ ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, ఇతర ప్రజాప్రతినిధులు, నామినేటెడ్ పదవుల్లో ఉన్న నేతలంతా బస్సు యాత్రలో పాల్గొంటారు. బస్సు యాత్రకు సంఘీభావంగా బైకులతో యువకులు ర్యాలీ నిర్వహించనున్నారు. హుకుంపేట మెయిన్ రోడ్డులోని పెట్రోల్ బంకు వద్ద బహిరంగ సభను నిర్వహించనున్నారు. వేలాది మంది ప్రజలు ఈ సభకు వస్తుండడంతో ఎమ్మెల్యే పాల్గుణతో పాటు పార్టీనేతలు విస్తృత ఏర్పాట్లు చేశారు. నవరత్నాల అమలు కమిటీ వైస్‌చైర్మన్ నారాయణమూర్తితో పాటు పార్టీ కేంద్ర కార్యాలయం ప్రతినిధులు కూడా హుకుంపేటకు చేరుకుని ఏర్పాట్లు పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాలతో భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలు

సామాజిక సాధికార బస్సు యాత్రతో పార్టీ నాయకులు,కార్యకర్తలు ఫుల్ జోష్‌లో ఉన్నారు. జాతీయ రహదారి, హుకుంపేట మెయిన్‌రోడ్డులో వైఎస్సార్‌సీపీ జెండాలు గురువారం మధ్యాహ్నం నుంచే రెపరెపలాడుతున్నాయి.రోడ్డుకు ఇరువైపులా పెద్ద ఎత్తున జెండాలను ఏర్పాటు చేశారు.

బస్సు యాత్రను విజయవంతం చేయాలి

సాక్షి,పాడేరు: హుకుంపేట మండలంలో శుక్రవారం నిర్వహించే సామాజిక సాధికార బస్సు యాత్రను అన్నివర్గాల ప్రజలు విజయవంతం చేయాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిలు గురువారం వేర్వేరు ప్రకటనల్లో కోరారు.



వేదిక వద్ద కుర్చీలు



ఫ్లెక్సీలు ఏర్పాటుచేస్తున్న కార్యకర్తలు



హుకుంపేట రహదారికి ఇరువైపులా వైఎస్సార్‌సీపీ జెండాల రెపరెపలు

అన్ని వర్గాలకు సామాజిక న్యాయం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

సాక్షి,పాడేరు: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరగడంతో పాటు గిరిజనుల సమగ్రాభివృద్ధి సాధ్యమైందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు. నియోజకవర్గంలోని హుకుంపేట మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించనున్న సామాజిక, సాధికార బస్సు యాత్ర ఏర్పాట్లను గురువారం ఆయన పర్యవేక్షించారు. బస్సు యాత్ర జరిగే బర్మన్‌గుడ నుంచి హుకుంపేట రహదారితో పాటు, సభ జరిగే మెయిన్‌రోడ్డులోని పెట్రోల్‌బంకు ప్రాంతంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగున్నర ఏళ్ల పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఎంతో మేలు జరిగిందన్నారు. పాడేరు కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయడంతో పాలన చేరువ అయిందన్నారు. అరకులోయ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గిరిజనుల అభివృద్ధి, ఇతర సంక్షేమ పథకాలకు సుమారు రూ.3వేల కోట్లు ఖర్చుపెట్టామన్నారు. అన్ని గ్రామాలకు రోడ్ల నిర్మాణంతో రవాణా వ్యవస్థ, సెల్‌టవర్లతో కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపరిచినట్టు తెలిపారు. గత టీడీపీ పాలనలో మారుమూల ప్రాంతాల అభివృద్ధి విషయంలో ఎంతో నిర్లక్ష్యం జరిగిందని, వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి గ్రామానికి రోడ్ల నిర్మాణంతో పాటు ప్రమాదకర గెడ్డలపై వంతెనల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. విద్యా,వైద్య రంగాల్లో ఎంతో పురోగతి సాధించినట్టు చెప్పారు. చేసిన అభివృద్ధిని తెలియజేసేందుకు ఈ సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. హుకుంపేట సభకు వేల సంఖ్యలో ప్రజలు తరలివస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నవరత్నాల అమలు కమిటీ వైస్ చైర్మన్ నారాయణమూర్తి, సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వంగపండు ఉషారాణి, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, ఎంపీపీ కూడా రాజుబాబు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, పార్టీ మండల అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

యాత్ర సాగేదిలా...

- ఉదయం 10 గంటలకు హుకుంపేట మండలం బర్మన్‌గుడ జంక్షన్‌లో ప్రారంభమవుతుంది.
- 10.30 గంటలకు కేజీబీవీలో నాడు-నేడు పనుల పరిశీలన, అనంతరం మంత్రుల ప్రెస్‌మీట్
- 11 గంటల కేజీబీవీ నుంచి సామాజిక సాధికార బస్సుయాత్ర ప్రాంభం
- మోదకొండమ్మతల్లి ఆలయం, జూనియర్ కళాశాల, సంతబయలు మీదుగా హుకుంపేట మెయిన్ రోడ్డు వరకు యాత్ర సాగుతుంది.
- 11.45 గంటలకు మెయిన్‌రోడ్డులోని మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పిస్తారు.
- 12.00 గంటల నుంచి 2 గంటల వరకు హుకుంపేట పెట్రోల్ బంక్ సమీపంలో బహిరంగ సభ

వచ్చే నెల నుంచి పింఛన్ రూ.3 వేలు

- జిల్లాలో 2.28 లక్షల మంది లబ్ధిదారులు
- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: వచ్చేనెల నుంచి జిల్లాలోని 22 మండలాల పరిధిలో 2.28 లక్షల మంది లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛన్‌ను రూ. 3వేలు అందజేయనున్నట్టు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ పాల్గొన్నారు. వైఎస్సార్ పింఛన్‌కానుక పెంపు, చేయూత,ఆసరా పథకం అమలు, డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ తదితర అంశాలపై కలెక్టర్, ఎమ్మెల్యేలకు సీఎం దిశా నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడు తూ పెంచినపింఛన్ సద్వినియోగంచేసుకోవా లన్నారు.



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి



హాజరైన కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ

జన్‌మన్ గృహాల సర్వే వేగవంతం

కలెక్టర్ సుమిత్ కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని ఆదివాసీ(పీవీటీజీ)లకు ప్రధానమంత్రి జన్‌మన్ గృహాలను మంజూరు చేసేందుకు చేపట్టిన సమగ్ర సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఐటీడీఏ పీవోలు, హౌసింగ్, ఉపాధి హామీ పథకం అధికారులు, ఎంపీడీవోలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ డేటా ప్రకారం జిల్లాలో 31,674 పీవీటీజీ కుటుంబాలు ఉన్నాయన్నారు. గృహాలు అవసరమైన పీవీటీజీలను గుర్తించి, ఆవాస్ ప్లస్ యాప్‌లో నమోదు చేయాలని తెలిపారు. వచ్చేనెల 5వ తేదీ నాటికి సర్వే పూర్తి చేస్తే, 10వతేదీన గృహాలు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. 15న ప్రధాన మంత్రి చేతుల మీదుగా గృహనిర్మాణాలు ప్రారంభవుతాయన్నారు. ప్రతి ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.2.39 లక్షల ఆర్థిక సాయం అందిస్తుందని, 2026 ఆర్థిక సంవత్సరం వరకు ఈ పథకం అమలులో ఉంటుందని తెలిపారు. అర్హులైన పీవీటీజీలను గుర్తించడంలో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అర్హత కలిగిన పీవీటీజీలకు ఉపాధి పనుల జాబ్‌కార్డులు పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు అభిషేక్, సూరజ్ గనోరే, చైతన్య పాల్గొన్నారు.

స్వయం ఉపాధికి రుణాలు మంజూరు చేయాలి

జిల్లాలోని బ్యాంకర్లు స్వయం ఉపాధి, పంట రుణాలను మంజూరు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం బ్యాంకు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంఈజీపీ పథకంలో దరఖాస్తులు 200వరకు పెండింగ్‌లో ఉన్నాయని, 55మందికి మాత్రమే రుణాలు మంజూరు అయ్యాయని చెప్పారు. మిగిలిన దరఖాస్తుదారులకు రుణాల మంజూరును వేగవంతం చేయాలన్నారు. ప్రాధాన్యతా రంగాలతో పాటు రైతులకు పంట రుణాలు కూడా మంజూరు చేయాలని, కాఫీ, మిరియాల రైతులకు దళారుల బెడద లేకుండా పెద్ద మొత్తంలో రుణాలు ఇవ్వాలన్నారు.

నాబార్డు వార్షిక ప్రణాళిక విడుదల

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నాబార్డు వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ విడుదల చేశారు. ప్రాధాన్యతా రంగాలకు అన్ని అంశాలతో కలిపి రూ.2,459 కోట్ల రుణ ప్రణాళికను సిద్ధం చేయగా కలెక్టర్ ఆమోదించారు. సకాలంలో ఆయా లక్ష్యాలను చేరుకోవాలని, రుణాల పంపిణీని వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం రవితేజ, డీఆర్‌డీఏ పీడీ మురళి, పారిశ్రామికశాఖ ఏడీ నవీన్‌కుమార్, ఆర్‌బీఐ ప్రతినిధి నాగ ప్రవీణ్, నాబార్డు డీడీఎం శమంతకుమార్, పలు బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

గరిష్ట కూలి పొందేలా పనులు చేయించాలి

డ్వామా పీడీ ఆదేశం

రాజవొమ్మంగి : ఉపాధి పనులకు వచ్చే వేతనదారులకు రోజుకు రూ.272 గరిష్ట కూలి గిట్టుబాటు అయ్యేలా చూడాలని డ్వామా పీడీ శివయ్య స్థానిక ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఎఫ్ఏలు, టీఏలు, ఇతర సిబ్బందితో ఆయన గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం సరాసరి దిన సరి కూలి రూ.240 మాత్రమే అందుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని, ఈ పరిస్థితి మారాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో 1,300 కుటుంబాలకు మాత్రమే వంద రోజుల పని కల్పన జరిగిందని, మార్చి లోగా మిగిలిన 2,500 కుటుంబాలకు కూడా వంద రోజుల పనిదినాలు కల్పించాలని ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆరునెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు రూ.70 లక్షలు త్వరలోనే రిలీజ్ అవుతాయని తెలిపారు. స్థానిక ఏపీవో సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ శివయ్య

32 మందికి కుటుంబ సంక్షేమ ఆపరేషన్లు

15 సంవత్సరాల తరువాత నిర్వహణ

కొయ్యూరు: రాజేంద్రపాలెం ఆస్పత్రిలో గురువారం 32 మంది పురుషులకు కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్సలు నిర్వహించారు. వైద్యులు మనోజ్ఞ ఆధ్వర్యంలో వీటిని పూర్తి చేశారు. గతంలో ప్రతి ఏడాది కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్సలు నిర్వహించారు. 15 సంవత్సరాలుగా ఈ ఆపరేషన్లు చేయడం నిలిపివేశారు.

ఇప్పుడు మళ్లీ ప్రారంభించారు. 70 మంది పురుషులు ఆపరేషన్లు చేయించుకునేందుకు ముందుకు వచ్చినా 32 మందికి మాత్రమే చేయగలిగారు. కేజీహెచ్ సివిల్ సర్జన్ ఆనంద్ ఈ శస్త్ర చికిత్సలు చేశారు.

పారంపర్య వైద్యం మానవాళికి ఎంతో ఉపయోగం

- ఆల్‌ఇండియా ఆయుష్ ప్రొఫెసర్ సురేష్ జకోటియా
- చింతూరులో నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు



జమాల్‌ఖాన్‌ను సన్మానిస్తున్న ఆయుర్వేద వైద్యులు

చింతూరు: సంప్రదాయ పారంపర్య వైద్యం మానవాళికి ఎంతో ఉపయోగపడుతోందని, అల్లోపతి వైద్యానికి లొంగని మొండి రోగాలు సైతం ఆయుర్వేదంతో నయమవుతాయని ఆల్ ఇండియా ఆయుష్ ప్రొఫెసర్ సురేష్ జకోటియా అన్నారు. పారంపర్య వైద్య మహాసంఘం, జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం చింతూరులో సంప్రదాయ వైద్య విధానంపై నిరంతర వైద్య విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జకోటియా మాట్లాడుతూ వనమూలికా వైద్యంలో తొలుత రోగాన్ని నిర్ధారిస్తే సగం సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఒక మూలిక 100 రకాల జబ్బులను నయం చేసే సంజీవనిలా పనిచేస్తుందని, వైద్య విజ్ఞానం మనతోటే అంతరించకుండా వారసులకు ఆయుర్వేద వనమూలిక వైద్యంలో మెలకువలు నేర్పి భావితరాలకు ఆరోగ్యాన్ని, ఆయుష్షుని ప్రసాదించాలని ఆయన సూచించారు. ఆయుర్వేద వైద్యులు మహమ్మద్ గని మాట్లాడుతూ ఇక్కడి అటవీ ప్రాంతంలో ఎంతో విలువైన ఔషధ మొక్కలు పుష్కలంగా ఉన్నాయని, తాను సందర్శించిన ప్రతిసారి ఎన్నో విలువైన మొక్కలు తన దృష్టికి వచ్చాయన్నారు. కరోనా వైద్య నిపుణులు ఆనందయ్య మాట్లాడుతూ ఆయుర్వేదంలో ముందుగా రోగికి మానసిక ధైర్యం కలిగించాలని అప్పుడే మనం ఇచ్చే మూలికా వైద్యం నూటికి నూరుశాతం ఫలితం ఇస్తుందన్నారు. అనంతరం చింతూరుకు చెందిన ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ మాట్లాడుతూ పారంపర్య వైద్య మహాసంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరంతర వైద్య విధాన సదస్సుకు అనేక మంది ఆయుర్వేద వైద్యులు హాజరు కావడం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యంతో పాటు సేవా కార్యక్రమాలు చేపడుతున్న జమాల్‌ఖాన్‌ను వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పారంపర్య వైద్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు చంద్రశేఖరరాజు, వేణుగోపాలరెడ్డి, ప్రసాదరావు, ముసద్దిక్, ఖాజామస్తాన్, ఖబీర్‌ఖాన్ పాల్గొన్నారు.

ఘాట్ రోడ్డులో రెండు ఆర్టీసీ బస్సులు ఢీ

- మహిళకు తీవ్రగాయాలు
- ట్రాఫిక్‌కు అంతరాయం



ఘాట్‌రోడ్డులో ఢీకొన్న రెండు ఆర్టీసీ బస్సులు



గాయపడిన మహిళ

పాడేరు: ఘాట్‌రోడ్డులోని 12వ మైలురాయి మలుపు వద్ద గురువారం రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొనడంతో ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన సమయంలో రెండు బస్సుల్లో ఎక్కువమంది ప్రయాణికులు ఉన్నారు. అందరూ సురక్షితంగా బయటపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. పాడేరు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు సుమారు 30మంది ప్రయాణికులతో విశాఖపట్నం వెళుతోంది. అదే సమయంలోని అనకాపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 43 మంది ప్రయాణికులతో జోలపుట్టువైపు వస్తోంది. పాడేరు-చోడవరం ఘాట్‌రోడ్డులోని 12వ మైలు రాయి మలుపువద్ద రెండు బస్సులు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అనకాపల్లి జిల్లా వి.మాడుగుల మండలం కోడూరు గ్రామానికి చెందిన సంతల్లో వ్యాపారం చేసుకునే పతాల పైడితల్లిమ్మ(55) అనే మహిళ తలకు తీవ్ర గాయమైంది. మిగిలిన వారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో ప్రయాణికులు, ఆర్టీసీ అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. రెండు బస్సుల ముందు భాగాలు నుజ్జయ్యాయి. గాయపడిన మహిళను మరో ఆర్టీసీ బస్సులో మాడుగుల ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన రెండు ఆర్టీసీ బస్సులు నిలిచిపోవడంతో కొంత సేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

అప్పన్నను దర్శించుకున్న చెన్నై హైకోర్టు న్యాయమూర్తి కార్తికేయన్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని గురువారం చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి.కార్తికేయన్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ వెంకటరమణ అందజేశారు.



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ కార్తికేయన్ దంపతులు

క్లుప్తంగా

ఐదు లీటర్ల సారా స్వాధీనం.. ఒకరి అరెస్టు

జి.మాడుగుల: సారా తరలిస్తున్న మహిళను పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి మండలం అన్నవరం నుంచి పాడేరు వైపు వస్తున్న వాహనాలను గురువారం తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న సిరగం ఈశ్వరమ్మ అనే మహిళను పట్టుకొని విచారించగా 5 లీటర్ల సారా తరలిస్తున్నట్టు తేలిందన్నారు. ఈ మేరకు ఈశ్వరమ్మను అరెస్టు చేసి సారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఐఎన్ఎస్ సుమేధకు ఘన స్వాగతం



సింధియా: ఆఫ్రికాతో పాటు 12 దేశాల్లో పర్యటించి తిరిగి గురువారం విశాఖపట్నం చేరుకున్న ఐఎన్ఎస్ సుమేధకు సిబ్బంది కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. దేశ సముద్ర నిబద్ధతను ప్రదర్శిస్తూ ఈ నౌక 22 వేల నాటికల్ మైళ్ల దూరాన్ని ప్రయాణించింది. ఆఫ్రికాతో సహా 12 దేశాలతో సముద్ర భాగస్వామ్యంలో పాల్గొంది.

స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్ రికార్డు ఉత్పత్తి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్ట్రక్చరల్ మిల్ విభాగం (ఎస్టీఎం) వివిధ ఉత్పత్తుల తయారీలో పలు రికార్డులను అధిగమిస్తుంది. గతంలో యాంగిల్, 50 ఎంఎం రౌండ్, 63 ఎంఎం రౌండ్ ఉత్పత్తుల్లో రికార్డులు సాధించగా డిసెంబర్ 27న 'బి' షిఫ్ట్‌లో 56 ఎంఎం రౌండ్ ఉత్పత్తిలో రికార్డు సాధించింది. విభాగంలో తయారయ్యే పలు ఉత్పత్తుల్లో ఒకటైన 56 ఎంఎం రౌండ్ ఆ రోజు అత్యధికంగా 1,239 టన్నులు ఉత్పత్తి సాధించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 8న 'సి' షిఫ్ట్‌లో 56 ఎం.ఎం రౌండ్ అత్యధికంగా 1,159 టన్నులు ఉత్పత్తి జరిగింది. రికార్డు ఉత్పత్తి సాధించిన ఎస్టీఎం విభాగం ఉద్యోగులను విభాగం ఉన్నతాధికారులు అభినందించారు.

మెరుగైన సేవలు అందించాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, చిత్రంలో ఎమ్మెల్సీ రఘువర్మ, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ దాత్రిరెడ్డి తదితరులు

హుకుంపేట: రెవిన్యూ సిబ్బంది పడుతున్న కష్టాలు నూతన భవనం అందుబాటులో రావడంతో తీరాయని కలెక్టరు సుమిత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని కలెక్టర్, ఐటీడీఏ నిధులతో నిర్మించిన తహసీల్దార్ భవనాన్ని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణతో కలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ముందుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి, కొబ్బరి కాయలు కొట్టి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ అనేది ప్రజలకు చాల ప్రాముఖ్యమన్నారు. తహసీల్దార్ కార్యాలయం నిర్మాణానికి గతంలో రూ. 90లక్షల నిధులు మంజూరు చేసినప్పటికీ సరిపడక పోవడంతో పనులు నిలిచిపోయామన్నారు. ఈ నేపథ్యంలో తహసీల్దార్ రాజ్యలక్ష్మి అందించిన సమాచారం మేరకు కలెక్టర్, ఐటీడీఏ, మండల ప్రజాపరిషత్ నిధులు రూ.25లక్షలు నిధులు కేటాయించినట్టు పేర్కొన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. జిల్లాలో ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తక్షణమే స్పందించి ఆ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మండల కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ రెవెన్యూ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ రఘువర్మ, ఐటీడీఏ పీవో అభిషేక్,సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి,ఎంపిపి కూడా రాజుబాబు,జడ్పీటీసీ సభ్యుడు రేగం మత్యలింగం, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎంపిటీసీ వెంకటరావుజిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు సామ్యేల్, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ,ఎంపిటీసీ కొమ్మ రమ,నాయకులు పాల్గోన్నారు.

వేర్వేరు కేసుల్లో 60 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలో వేర్వేరు కేసుల్లో 60 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశామని ఎస్సై గోపాలరావు గురువారం తెలిపారు. చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, ధారకొండ నుంచి విజయవాడకు దేవరపు నవీన్‌కుమార్, భీశెట్టి కిరణ్ బైకుపై 30 కిలోల గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. సీలేరు నుంచి ఉత్తరప్రదేశ్‌కు కారులో 30 కేజీల గంజాయిని అక్రమంగా తరలిస్తున్న షేక్ నాగుల్, ఆశుతోష్ యాదవ్, ఉమర్‌ఖాన్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మొత్తం గంజాయి విలువ రూ. 3 లక్షలు ఉంటుందన్నారు. కారు, బైకును స్వాధీనం చేసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



గంజాయి, హాష్ ఆయిల్ తయారీ యంత్రాలతో పట్టుబడిన నిందితుడితో ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్‌లు

గంజాయి, హాష్ ఆయిల్ తయారీ యంత్రాలు స్వాధీనం

జి.మాడుగుల: మండలంలోని లువ్వాసింగి పంచాయతీ సోపాలు గ్రామంలో పోలీసుల తనిఖీల్లో ఒకరిని అరెస్టు చేసి, హాష్ ఆయిల్ తయారు చేసే రెండు యంత్రాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ గురువారం తెలిపారు. సోఫాలు గ్రామంలో గంజాయి, హాష్ ఆయిల్ యంత్రాలు ఉన్నట్టుగా వచ్చిన సమాచారం మేరకు తనిఖీకి వెళ్లగా, పోలీసులను చూసి పారిపోతున్న గ్రామానికి చెందిన వంతాల నాగేశ్వరరావును పట్టుకుని విచారించామన్నారు. అతడి నుంచి 1.26 కిలోల గంజాయి పట్టుబడిందని, హాష్ ఆయిల్ తయారు చేసే రెండు యంత్రాలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

అరకు అందాలు చూసొస్తూ...

- రోడ్డు ప్రమాదంలో మిండి యువకుడు దుర్మరణం
- మరో యువకుడికి తీవ్ర గాయాలు



ప్రమాద ఘటన స్థలం



తాడాన తేజ (ఫైల్)

కొత్తవలస/అక్కిరెడ్డిపాలెం: అరకు అందాలను తిలకించి తిరుగుప్రయాణమైన ఇద్దరు స్నేహితులు గురువారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వీరిలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గాజువాక సమీపంలోని మిండి గ్రామానికి చెందిన యువకులు తేజ, భానులు ద్విచక్రవాహనంపై అరకు విహారయాత్రకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో విజయనగరం జిల్లా కొత్తవలస మండలం నిమ్మలపాలెం కూడలి మలుపు వద్ద ముందువెళ్తున్న వాహనాన్ని ఓవర్ ట్రాక్‌చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టారు. దీంతో తేజ(23) అక్కడికక్కడే మృతి చెందగా, భాను గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వైద్యంకోసం 108 వాహనంలో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. తీవ్ర గాయాలపాలైన భాను కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. మృతుడు తేజ తల్లిదండ్రులు అక్కిరెడ్డిపాలెంలో కూరగాయల వ్యాపారం చేస్తుంటారని మిండి గ్రామస్తులు తెలిపారు.

మనస్తాపంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



దువ్వాడ రైల్వేస్టేషన్ ఎన్టీపీసీ ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రసాద్

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్‌లో రైలుపట్టాల కిందపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దువ్వాడ జీఆర్‌పీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం విశాఖ ఉక్కు ఉద్యోగి ఎంవీఎస్ ప్రసాద్ తన కుమారుడు నెక్కంటి నవీన్ కృష్ణ, భార్య అరవిందతో కలిసి దువ్వాడ సమీపంలోని సాయిరామ్‌నగర్‌లో నివాసముంటున్నారు. నవీన్ కృష్ణ కొద్దికాలం పాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేశాడు. నెల రోజుల క్రితం ఆ కంపెనీ కొంతమంది ఉద్యోగులను ఆపేసింది. వీరిలో నవీన్‌కృష్ణ కూడా ఉండడంతో తీవ్ర మనస్థాపానికి గురై గురువారం ఉదయం దువ్వాడ రైల్వేస్టేషన్ ప్రధాన భవనానికి వెనుకవైపునున్న ఎన్టీపీసీ రైల్వేట్రాక్‌పై బలవన్మరణానికి పాల్పడ్డాడు. జీఆర్‌పీ సిబ్బంది మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

రెండు తాటాకిళ్లు దగ్ధం



దగ్ధమైన ఇళ్లు



అగ్ని ప్రమాదం నుంచి కుమారుడిని రక్షించుకున్న తల్లి లివిక

ప్రమాదం నుంచి బయటపడిన చిన్నారులు

రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు తాటాకిల్లు దగ్ధమయ్యాయి. గ్రామశివారులో ఆదివాసీలైన తండ్రి కొడుకులు పొట్టపోయిన మారయ్య, నాగరాజు పక్క పక్క తాటాకిళ్లలో నివాసముంటున్నారు. గురువారం మధ్యాహ్నం నాగరాజు ఇంట్లోని విద్యుత్ మీటర్ నుంచి శబ్దం వచ్చి, ఇంటి పైకప్పు పైకి అగ్ని కీలలు వ్యాపించాయి. గమనించిన చుట్టు పక్కల యువకులు చొరవ చూపి ఇంట్లో ఉన్న ఇద్దరు పిల్లలను బయటకు తీసుకొని వచ్చారు. ఉయ్యాలలో చిన్న కొడుకు ఉన్నాడని నాగరాజు భార్య కేకలు వేస్తూ ఇంట్లోకి ప్రవేశించి ఆ చిన్నారిని కూడా బయటకు తీసుకొని రావడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. నాగరాజు చెరకు నరుకు పనులకు వలస వెళ్లడంతో ఆ ఇంట్లో తల్లీ పిల్లలు మాత్రమే ఉన్నారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 2 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు అంచనా. మంటలు చుట్టుపక్కల ఇళ్లకు వ్యాపించకుండా స్థానిక యువకులు జాగ్రత్త వహించారు.

దోమల మందు తాగి చిన్నారి మృతి

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్ సమీప నేతాజీ నగర్‌లో నివాసముంటున్న పోసమూరి వీర వెంకట రాజు తన నాలుగేళ్ల కుమార్తె ఆడుకుంటూ దోమల నివారణ లిక్విడ్ తాగడంతో మృతి చెందింది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గాజువాకలో కాకతీయ స్కూల్లో డ్రైవర్‌గా పని చేస్తున్న వీర వెంకట రాజు, భార్య నిఖిత, కుమార్తె నిత్యశ్రీ ఆడుకుంటూ అందుబాటులో దోమల నివారణకు వాడే లిక్విడ్ నీడిల్ నోట్లో పెట్టుకుని తాగేసింది. ఆడుకుని నిద్రపోయిందని భావించిన తల్లి..సాయంత్రం వరకూ పాప లేవకపోవడంతో అనుమానం వచ్చి ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. అక్కడి నుంచి పాత గోపాలపట్నంలో ఉన్న చిన్నారి అమ్మమ్మ ఇంటికి మృతదేహాన్ని తీసుకొచ్చారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు గోపాలపట్నం పోలీసులు సమాచారాన్ని సేకరించారు. చిన్నారి మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

ధర్మాచరణతోనే అభ్యుదయం



రాజేంద్రపాలెం నుంచి శోభయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

కొయ్యూరు: భవంతుని నామ స్మరణే మనల్ని కష్టాల నుంచి గట్టెక్కిస్తుందని, అభ్యుదయం కోసం అందరూ ధర్మం వైపు అడుగులు వేయాలని పాకలపాడు గురుదేవుల (కిటుముల)ఆశ్రమానికి చెందిన రామానంద స్వామీజి తెలిపారు. రాజేంద్రపాలెంలో గురువారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. హిందూమతం గొప్పతనం తెలియని కొందరు పరమతాల వైపు వెళ్తున్నారని చెప్పారు. సమరసతసేవా ఫౌండేషన్ జిల్లా నాయకురాలు ఇందిరాదేవి మాట్లాడుతూ 25 వేల మందిని పునరాగమనం చేయించామన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ బడుగు రమేష్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పురాతన మతం హిందూ మతమన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్‌కు చెందిన సుధాకర్ మాట్లాడుతూ ధాన్యం, యోగా వల్ల కలిగే లాభాలను వివరించారు. ఈ సమ్మేళనం సందర్భంగా గ్రామం రామనామస్మరణతో మార్మోగింది. మండలం నలుమూలల నుంచి వచ్చిన వందలాది మంది హిందువులు జై శ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. సమరసతసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హిందూ సమ్మేళనంలో భాగంగా రాజేంద్రపాలెం నుంచి కొయ్యూరు వరకు శోభాయాత్రను నిర్వహించారు. రాజేంద్రపాలెం సర్పంచ్ పి.సింహాచలం, ఎస్.సన్యాసిరావు, ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డి.వి.డి. ప్రసాద్, బీహెచ్‌పీవీ మండల నేత మల్లిబాబు, ఆర్ట్ ఆఫ్ లివింగ్‌కు చెందిన జేవీ గిరిబాబు,ఎస్ గిరిబాబు,సమరసత సేవా ఫౌండేషన్‌కు చెందిన ఎస్ వరలక్ష్మి, శ్రీదేవి, సుధాకర్, ధారకొండ, లింగమూర్తి, ఎం సోమరాజు, కె.లక్ష్మి పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో రైతులకు మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కొయ్యూరు: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన పంటలను సాగు చేయవచ్చని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సేద్య శాస్త్రవేత్త డాక్టర్ వాన ప్రసాదరావు సూచించారు. స్థానిక అల్లూరి పార్క్‌లో ఆయన గురువారం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో రైతులు తొమ్మిది ప్రాథమిక సూత్రాలు పాటించాలని సూచించారు. దీని మూలంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వస్తుందన్నారు. శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ సస్యరక్షణకు చేపట్టాల్సిన చర్యలను సూచించారు. సమీకృత వ్యవసాయ పద్ధతులను పాటించాలన్నారు. పురుగుమందులు, రసాయన ఎరువులతో భూసారం దెబ్బతింటుందన్నారు. ఈ కారణంగా సేంద్రియ సాగు చేపట్టాలన్నారు. 40 మంది రైతులు పాల్గొన్నారు.

మార్గశిర శోభ

- కనకమహాలక్ష్మి ఆలయానికి పోటెత్తిన భక్తులు
- ఘనంగా మూడో గురువారం పూజలు



ఆలయ మండపం వద్ద అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



చిన్నారిని అమ్మకు చూపుతున్న భక్తుడు

డాబాగార్డెన్స్: శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మార్గశిర మాసం మూడో గురువారం అమ్మవారి దర్శనానికి రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాదిగా భక్తులు తరలివచ్చారు. బుధవారం అర్ధరాత్రి నుంచే అమ్మవారి దర్శనానికి బారులుదీరారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సహస్ర నామార్చనలు జరిపారు. స్వర్ణాభరణాలతో అమ్మవారు దేదీప్యమానంగా వెలుగొందారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వేద మంత్రాలు, నాదస్వరాలతో ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, ఋత్విక్ వరణలు, వేద పారాయణాలు, శ్రీచక్రార్చన లక్ష్మీ హోమం తదనంతరం అమ్మవారికి విశేష పూజ నిర్వహించారు. పరిసర ప్రాంతాల ప్రజలు తీసుకొచ్చిన పసుపు కుంకుమ నీళ్లతో జలాభిషేకం జరిపారు. పెద్ద ఎత్తున క్షీరాభిషేకం నిర్వహించి పసుపు పూశారు. ప్రత్యేక పూజలు జరిపిన తర్వాత అమ్మవారికి స్వర్ణాభరణ అలంకరణ చేశారు. అర్ధరాత్రి 12.05 నుంచి 1.30 గంటల వరకు ఈ అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం వెండి కవచాలు తొడిగారు. మధ్యాహ్నం 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి మహానివేదన(రాజభోగం), 12 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్వదర్శనం, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు పంచామృతాభిషేక సేవ, సహస్రనామార్చన, స్వర్ణాభరణ అలంకరణ, రాత్రి 7 నుంచి సర్వదర్శనం కల్పించారు. ఆలయ ఈవో కె.శిరీష, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వన్‌టౌన్ పోలీసులు ఏర్పాట్లను పరిశీలించారు.



క్యూలో భక్తులు



టౌన్‌కొత్తరోడ్డు వరకు భక్తజనసందోహం

ప్రత్యేక ఏర్పాట్లు..

భక్తులకు దేవస్థానం అధికారులు మంచినీటి సౌకర్యం కల్పించారు. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేలాది మంది భక్తులకు భోజన ఏర్పాట్లు చేశారు. రీడింగ్ రూమ్ వద్ద ధర్మ దర్శనంతో పాటు రూ.100, రూ.200 టికెట్లు తీసుకున్న భక్తులకు క్యూల్లో పంపించారు. సీతారామస్వామి ఆలయం వైపు వీవీఐపీ, వీఐపీతో పాటు వృద్ధులు, వికలాంగులు, రూ.500 టికెట్ తీసుకున్న వారికి దర్శనం కల్పించారు. అమ్మవారి ఆలయ వెనుకభాగం, ఆలయ ప్రధాన ద్వారం, దర్శనం అనంతరం బయటకు వచ్చే మార్గంలో ప్రసాద కౌంటర్లు విక్రయించారు. పలు స్వచ్ఛంద సంస్థలు ఉచిత ప్రసాదం అందజేశాయి. టూ వే కావడంతో వాహనాల రాకపోకలు ఎక్కడికక్కడ నిలిచిపోయి.. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. భక్తుల సౌకర్యార్థం సింహాచలం, మధురవాడ నుంచి ఉచిత బస్సు సర్వీసులు నడిపినట్లు ఆలయ ఈవో తెలిపారు.